సాక్షి
కుమురం భీం

శనివారం : 6 : జనవరి : 2024



ఇంటింటికీ అక్షింతల పంపిణీ
జిల్లాలో శ్రీరాముడి అక్షింతల పంపిణీ కొనసాగుతోంది. ఈ సందర్భంగా భక్తులు జిల్లా కేంద్రంలో శ్రీరామ సంకీర్తన, భజన కార్యక్రమాలు చేపట్టారు. 9లో▸



'వంట' బిల్లులు అందేదెప్పుడు..?
మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు, వేతనాలు అందక ఇబ్బంది పడుతున్నారు. అప్పులు చేయాల్సి వస్తోందని కార్మికులు వాపోతున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
28.1 / 15.6

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా తక్కువగా నమోదవుతాయి. చలిగాలులు వీస్తాయి. చలి తీవ్రత మళ్లీ పెరుగుతుంది.

న్యూస్‌రీల్

సకాలంలో పరీక్ష ఫీజు చెల్లించాలి
కాగజ్‌నగర్‌రూరల్‌: డాక్టర్‌ బీఆర్‌ అంబేద్కర్‌ ఓపెన్‌ యూనివర్సిటీలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు డిగ్రీ సెమిస్టర్‌ 3, 5 పరీక్షల ఫీజు సకాలంలో చెల్లించాలని స్టడీ సెంటర్‌ కోఆర్డినేటర్‌ దత్తాత్రేయ తెలిపారు. 3, 5 సెమిస్టర్ల పరీక్ష ఫీజు ఈ నెల 17 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించుకోవచ్చని పేర్కొన్నారు. ప్రతీ సబ్జెక్టుకు రూ.150, సైన్సు విద్యార్థులు ప్రాక్టికల్‌ ఫీజు ప్రతీ ప్రాక్టికల్‌కు రూ.150 చొప్పున అదనంగా చెల్లించాలని సూచించారు. సెమిస్టర్‌ 3 పరీక్షలు వచ్చే నెల 16 నుంచి 22 వరకు, సెమిస్టర్‌ 5 పరీక్షలు ఫిబ్రవరి 26 నుంచి మార్చి 2 వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

మొక్కల సంరక్షణపై దృష్టి సారించాలి



నర్సరీని పరిశీలిస్తున్న అధికారి

కౌటాల(సిర్పూర్‌): మొక్కల సంరక్షణపై దృష్టి సారించాలని అదనపు డీఆర్‌డీవో కుటుంబరావు అన్నారు. మండల కేంద్రంలోని నర్సరీని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీల్లో ప్రజలకు అవసరమైన అన్ని మొక్కలు పెంచాలన్నారు. మొక్కలు ఎండిపోకుండా క్రమం తప్పకుండా నీళ్లు పట్టాలని, నర్సరీలో గడ్డి పెరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేసవి దృష్ట్యా తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకు ముందు కౌటాల నర్సరీని ఎంపీపీ బసర్కార్‌ విశ్వనాథ్‌ ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో నస్రుల్లాఖాన్‌, ఏపీవో పూర్ణిమ, సర్పంచ్‌ మౌనిశ్‌, పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ, నాయకులు ఆగయ్య, రవీందర్‌గౌడ్‌, గోపాల్‌ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



ఆత్రం స్వప్న



రిక్కల విష్ణు ప్రియ

రెబ్బెన(ఆసిఫాబాద్‌): మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో జరనున్న జాతీయస్థాయి బాల్‌ బ్యాడ్మింటన్‌ పోటీలకు రెబ్బెన మండలం గోలేటికి చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికైనట్లు బాల్‌బ్యాడ్మింటన్‌ అసోసియేషన్‌ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌.నారాయణ రెడ్డి తెలిపారు. గోలేటికి చెందిన ఆత్రం స్వప్న, రిక్కల విష్ణు ప్రియ జాతీయస్థాయి పోటీల్లో తెలంగాణ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. ఆత్రం స్వప్న తెలంగాణ రాష్ట్ర మహిళా జట్టు కెప్టెన్‌గా వ్యవహరించనున్నట్లు తెలిపారు. గతంలోనూ స్వప్న జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్‌ సబ్‌ జూనియర్‌, జూనియర్‌, సీనియర్‌ స్థాయి పోటీల్లో పాల్గొని రాణించింది. 2018లో జరిగిన అంతర్జాతీయ పోటీల్లోనూ పాల్గొని ప్రతిభ చూపినట్లు తెలిపారు. విష్ణు ప్రియ జాతీయ స్థాయి సబ్‌ జూనియర్‌, జూనియర్‌ పోటీల్లో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు నర్సింగం, సంయుక్త కార్యదర్శి ఎస్‌.తిరుపతి, భాస్కర్‌, శ్రీనివాస్‌ రెడ్డి తదితరులు అభినందించారు.

11న గురుమిలన్‌ దినోత్సవం
కెరమెరి: నార్నూర్‌ మండలం కొత్తపల్లిలో బంజారా దీక్ష భూమిలో ఈ నెల 11న 45వ గురుమిలన్‌ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు సేవాలాల్‌ సేనా జిల్లా అధ్యక్షుడు రూప్‌లాల్‌ రాథోడ్‌ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జాతర నిర్వహించడంతో పాటు 7 నుంచి 15 వరకు కబడ్డీ పోటీలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

పని నుంచి బడికి..!

చిన్నారులు పనుల్లో కాదు.. పాఠశాలల్లో ఉండాలనే సదుద్దేశంతో ప్రారంభించిన బడి బయట పిల్లల గుర్తింపు సర్వే జిల్లాలో విజయవంతంగా కొనసాగుతోంది. క్షేత్రస్థాయిలో సీఆర్పీలు(క్లస్టర్‌ రిసోర్స్‌ పర్సన్లు) వివరాలు సేకరిస్తున్నారు. ఈ నెల 10 వరకు కొనసాగే సర్వేలో గతం కంటే ఎక్కువ మంది పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు స్పష్టం చేశారు.



వాంకిడిలో పిల్లల వివరాలు సేకరిస్తున్న సీఆర్పీ

- విజయవంతంగా కొనసాగుతున్న బడిబయట పిల్లల గుర్తింపు సర్వే
- ప్రబంధ్‌ పోర్టల్‌లో 234 మంది విద్యార్థుల వివరాలు నమోదు
- పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు
- సర్వేలో పాల్గొంటున్న 58 మంది సీఆర్పీలు
- ఈ నెల 10తో ముగియనున్న సర్వే

కెరమెరి(ఆసిఫాబాద్‌): చదువుకునే వయస్సులో వివిధ కారణాలతో బడికి దూరమైన చిన్నారులను గుర్తించేందుకు డిసెంబర్‌ 11 నుంచి జిల్లాలో బడి బయట పిల్లల గుర్తింపు సర్వే ప్రారంభమైంది. ఏటా ఈ సర్వే నిర్వహించి పిల్లలను పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. అయితే తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నిర్లక్ష్యమో తెలియదు కానీ.. డ్రాపౌట్ల సంఖ్య మాత్రం పెరుగుతోంది. దీంతో ఈ ఏడాది బడి బయట పిల్లల గుర్తింపు సర్వేను పకడ్బందీగా చేపట్టి, పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. అలాగే క్షేత్రస్థాయిలో సేకరించిన వివరాలను ఎప్పటికప్పుడు ప్రబంధ్‌ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. దీంతో జిల్లాలో ప్రస్తుతం సర్వే విజయవంతంగా కొనసాగుతోంది.

67 క్లస్టర్ల పరిధిలో..

జిల్లాలోని 15 మండలాల పరిధిలో 335 గ్రామ పంచాయతీలు, కాగజ్‌నగర్‌ మున్సిపాలిటీ ఉంది. జిల్లా వ్యాప్తంగా 67 క్లస్టర్ల పరిధిలో 58 మంది సీఆర్పీలు 25 రోజులుగా ఆవాస ప్రాంతాల్లో సర్వే నిర్వహిస్తున్నారు. శుక్రవారం వరకు జిల్లాలో 300 మందికి పైగా బడి బయట, బడి మానేసిన విద్యార్థులను గుర్తించారు. వీరిలో 234 మంది వివరాలను ప్రబంధ్‌ పోర్టల్‌ నమోదు చేశారు. వివరాలు నమోదు చేసిన వారిలో 193 మంది ప్రాథమిక స్థాయి(6– 14 ఏళ్లు) విద్యార్థులు ఉండగా, 40 మంది సెకండరీ(15– 19 ఏళ్లు) విద్యార్థులు, ఒకరు వలస విద్యార్థి ఉన్నారు. 2021లో 176 మంది విద్యార్థుల వివరాలను ప్రబంధ్‌ పోర్టల్‌లో అప్‌లోడ్‌ చేయగా.. గతేడాది 148 మంది విద్యార్థుల వివరాలను నమోదు చేశారు. ఇందులో 6– 14 ఏళ్ల వారు 120 మంది ఉండగా, 15 నుంచి 19 ఏళ్ల వారు 28 మంది ఉన్నారు. ఈ నెల 10 వరకు ఈ సర్వే కొనసాగనున్న నేపథ్యంలో మరికొంత మంది బడి బయట పిల్లలను గుర్తించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

సర్వేపై ప్రత్యేక అవగాహన

బడి బయట పిల్లల గుర్తింపు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలనే ఉద్దేశంతో డిసెంబర్‌ 8న జిల్లా విద్యాశాఖ అధికారి, సెక్టోరియల్‌ అధికారులు ఎంఈవోలు, కాంప్లెక్స్‌ ఉపాధ్యాయులు, ఎంఎస్‌వోలు, సీఆర్పీలకు ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. జూమ్‌ మీటింగ్‌ నిర్వహించి సర్వేపై సూచనలు చేశారు. అలాగే రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయం నుంచి ఈ నెల 3న కూడా క్వాలిటీ కోఆర్డినేటర్లు, సీఆర్పీలతో జూమ్‌ మీటింగ్‌ నిర్వహించారు. విద్యార్థుల సర్వేపై జిల్లాల వారీగా సమీక్షించారు. సర్వేకు క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. పూర్తిస్థాయిలో డ్రాపౌట్‌ విద్యార్థులను గుర్తించేలా సర్వే కొనసాగించాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

బడిలో చేర్పించేలా చర్యలు..

సర్వేలో గుర్తించిన డ్రాపౌట్‌ విద్యార్థులను పాఠశాలలో చేర్పించాల్సిన బాధ్యత సీఆర్పీలపై ఉందని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు గుర్తించిన బడి బయట పిల్లల్లో సుమారు 30 మందిని పాఠశాలల్లో చేర్పించినట్లు సమాచారం. నవంబర్‌ 1 నుంచి వరుసగా 30 రోజులపాటు బడికి హాజరు కాని విద్యార్థులను గుర్తిస్తున్నారు. విద్యార్థుల వయస్సు ఆధారంగా సమీప పాఠశాలలోగాని, యూఆర్‌ఎస్‌లో నమోదు చేసేందుకు అవకాశం కల్పించారు. సెకండరీ ఎడ్యుకేషన్‌ విద్యార్థులకు ఓపెన్‌ స్కూల్‌, ఇంటర్‌లో ప్రవేశం కల్పిస్తున్నారు.

పకడ్బందీగా సర్వే



జిల్లాలోని అన్ని మండలాల్లో బడి బయట పిల్లల గుర్తింపు సర్వే పకడ్బందీగా కొనసాగుతుంది. క్లస్టర్ల పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న సీఆర్పీలు సర్వేలో పాల్గొంటున్నారు. కాంప్లెక్స్‌ ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే 234 మంది విద్యార్థుల వివరాలను ప్రబంధ్‌ పోర్టల్‌ నమోదు చేశాం. మిగిలిన నాలుగు రోజుల్లో మరో 50 మందిని గుర్తించే అవకాశం ఉంది.

– ఉప్పులేటి శ్రీనివాస్‌,
సమగ్ర శిక్ష క్వాలిటీ జిల్లా కోఆర్డినేటర్‌

'ప్రజాపాలన' వివరాలు
ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

- కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడే



మాట్లాడుతున్న కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడే

ఆసిఫాబాద్‌అర్బన్‌: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలో స్వీకరించిన ప్రతీ దరఖాస్తును పరిశీలించి, వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో శుక్రవారం అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారితో కలిసి డాటా ఎంట్రీ ఆపరేటర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. కలెక్టర్‌ మాట్లాడుతూ ఈ నెల 6 వరకు నిర్వహించే ప్రజాపాలన కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులను డాటా ఎంట్రీ ఆపరేటర్లు పరిశీలించి, దరఖాస్తుల్లోని పూర్తి సమాచారాన్ని ఆన్‌లైన్‌లో తప్పుల్లేకుండా నమోదు చేయాలని ఆదేశించారు. వివరాలు నమోదు చేసే సమయంలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆధార్‌, రేషన్‌ కార్డుల వివరాలతోపాటు మొబైల్‌ నంబర్‌, దరఖాస్తుదారులు నింపిన సమాచారాన్ని మాత్రమే అప్‌లోడ్‌ చేయాలన్నారు. వివరాలు ఆన్‌లైన్‌లో నమోదైన తర్వాత సంబంధిత దరఖాస్తుదారుడి మొబైల్‌కి సందేశం వెళ్తుందని తెలిపారు. ఈ నెల 17 వరకు ఆన్‌లైన్‌ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీపీవో ఉమర్‌ హుస్సేన్‌, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

రంగయ్య దంపతులకు ఎంపీ సన్మానం



రంగయ్య, వీణను సన్మానిస్తున్న ఎంపీ 'సోయం'

కెరమెరి(ఆసిఫాబాద్‌): మండలంలోని సావర్‌ఖేడా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కడేర్ల రంగయ్య, ఆయన సతీమణి వీణను శుక్రవారం ఆదిలాబాద్‌లో ఎంపీ సోయం బాపూరావు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సమాజానికి దిశా నిర్దేశం చేసే ఉపాధ్యాయులు భగవంతుని స్వరూపాలని అన్నారు. పైసా ఆశించకుండా వీణ పదేళ్లుగా విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించడం గొప్ప విషయమని, ఎందరో ఉన్నత పాఠశాలల్లో చేరేందుకు రంగయ్య చేసిన కృషి మరువలేనిదన్నారు. ఆదిలాబాద్‌ పార్లమెంట్‌ పరిధిలోని సావర్‌ఖేడా పాఠశాలకు పీఎం శ్రీ పథకం కింద రూ.రెండు కోట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. గ్రామంతోపాటు పాఠశాలలో మరిన్ని వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. సావిత్రీబాయి పూలే అవార్డుకు ఎంపికైన వీణను అభినందించారు. త్వరలో ప్రధానమంత్రి మోదీతో భేటీకి ఏర్పాట్లు చేస్తామన్నారు. అలాగే కుమురం భీం మనుమడు కుమురం సోనేరావు సైతం రంగయ్య దంపతులను సన్మానించారు.

జీవో 63 అమలు చేయాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ధరణి కంప్యూటర్‌ ఆపరేటర్లు

ఆసిఫాబాద్‌: జిల్లాలో ధరణి పోర్టల్‌ కంప్యూటర్‌ ఆపరేటర్లకు జీవో 63 ప్రకారం రూ.31,040 వేతనం చెల్లించాలని కోరుతూ శుక్రవారం కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడేకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తహసీల్దార్‌ కార్యాలయాల్లో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల కోసం 17 మంది ఫీల్డ్‌ టెక్నికల్‌ స్టాఫ్‌(ధరణి కంప్యూటర్‌ ఆపరేటర్లు)ను నియమించినట్లు తెలిపారు. టీఎస్‌టీఎస్‌ టెండర్‌ ద్వారా ఈ సెంట్రిక్‌ సొల్యూషన్స్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ అనే థర్డ్‌ పార్టీ ఏజెన్సీ ఆధ్వర్యంలో పని చేస్తున్నామని పేర్కొన్నారు. 2018 మే నుంచి 2021 జూలై వరకు ప్రతినెలా రూ.9,878 చెల్లించారని, అనంతరం రూ.11,070 చెల్లిస్తున్నారన్నారని వెల్లడించారు. పెండింగ్‌ వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు.

వేతనాలు విడుదల చేయాలని నిరసన



కలెక్టరేట్‌ ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు, కార్మికులు

ఆసిఫాబాద్‌అర్బన్‌: జిల్లాలోని ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్‌ పద్ధతిలో పని చేస్తున్న కార్మికులకు పెండింగ్‌ వేతనాలు చెల్లించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్‌ డిమాండ్‌ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌ ఎదుట శుక్రవారం కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో పని చేస్తున్న వాచ్‌మెన్‌, వాచ్‌ఉమెన్‌, కామటి, కుక్‌, స్కావెంజర్‌ తదితర కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్‌ కార్మికులకు నెలల తరబడి వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. బీసీ పోస్ట్‌ మెట్రిక్‌ కార్మికులకు 11 నెలలు, ప్రీమెట్రిక్‌ వారికి ఏడు నెలలు, ఎస్సీ ప్రీమెట్రిక్‌, పోస్ట్‌ మెట్రిక్‌ హాస్టళ్లలోని కార్మికులకు ఏడు నెలలుగా వేతనాలు అందించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. అలాగే కార్మికులకు ఈఎస్‌ఐ, పీఎఫ్‌ సౌకర్యం కల్పించాలని, హెల్త్‌ కార్డులు, గుర్తింపు కార్డులు మంజూరు చేయాలన్నారు. ప్రతినెలా 5లోగా వేతనాలు విడుదల చేయకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు, కార్మికులు తిరుపతి, సత్యశ్రీ, లత, కవిత, కొమరయ్య, లక్ష్మి, శారద, రమాదేవి, రేవతి, రాణి, రమ్య, పుష్పలత, రత్నమాల పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు వినియోగించుకోవాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న కృష్ణారావు, తదితరులు

కాగజ్‌నగర్‌రూరల్‌: అర్హులైన వారు సంక్షేమ పథకాలు వినియోగించుకోవాలని జెడ్పీ చైర్మన్‌ కోనేరు కృష్ణారావు అన్నారు. మండలంలోని ఈజీగాం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తప్పులు లేకుండా దరఖాస్తులు నింపి, అధికారులకు సమర్పించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ కిరణ్‌కుమార్‌, ఎంపీవో గౌరీశంకర్‌, జెడ్పీ కోఆప్షన్‌ సభ్యుడు సిద్దిక్‌, సర్పంచ్‌ మల్లేశ్‌, ఎంపీటీసీ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాపాలన'కు 24,040 దరఖాస్తులు

ఆసిఫాబాద్‌: ప్రజాపాలన కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా కొనసాగుతుంది. శుక్రవారం 15 మండలాల్లో 24,040 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడే ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో మొత్తం దరఖాస్తుల సంఖ్య 1,46,233కు చేరింది.

అనువైన స్థలం.. ప్రతిపాదనలకే పరిమితం

- దశాబ్దాల క్రితమే తలాయి జలవిద్యుత్‌ కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు
- 2007లో స్థలాన్ని పరిశీలించిన జెన్‌కో అధికారులు
- కాంగ్రెస్‌ సర్కారుపై స్థానికుల ఆశలు



తలాయి జల విద్యుత్‌ కేంద్రం ఏర్పాటు కోసం సర్వే నిర్వహించిన ప్రదేశం

బెజ్జూర్‌(సిర్పూర్‌): బెజ్జూర్‌ మండలంలోని తలాయి జల విద్యుత్‌ ప్రాజెక్టు కలగానే మిగిలిపోతోంది. ఇక్కడ ప్రాజెక్టు నిర్మించేందుకు అనువైన స్థలం ఉందని అధికారులు గతంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినా నేటికీ ముందడుగు పడటం లేదు. ప్రపంచ వ్యాప్తంగా జల విద్యుత్‌ ప్రాధాన్యతనిస్తూ బొగ్గు, ఇంధనాల ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌కు సెలవు పలుకుతుంటే.. జల విద్యుత్‌కు అనువైన ప్రాజెక్టుపై ఇప్పటివరకు పాలకులు దృష్టి సారించడం లేదు. ప్రత్యేక రాష్ట్రంలోనూ జల విద్యుత్‌కేంద్రం పనులు మొదలవుతాయని ఆశించినప్పటికీ నిరాశే ఎదురైంది. పెండింగ్‌ ప్రాజెక్టులపై ప్రధాన దృష్టి సారించిన కాంగ్రెస్‌ సర్కారు తలాయి జల విద్యుత్‌ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వాలు మారినా.. అదే తీరు

ప్రాణహిత నదిపై జల విద్యుత్‌ కేంద్రానికి నిజాం పాలన కాలంలోనే బీజం పడింది. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో ఈ కేంద్రం నిర్మించాలని ప్రతిపాదనలు చేశారు. ప్రస్తుతం మహారాష్ట్రలోని దేవులమర్రి, జిల్లాలోని బెజ్జూర్‌ మండలం తలాయి గ్రామాల మధ్య ఈ జల విద్యుత్‌ కేంద్రం కోసం అప్పటి ప్రభుత్వం సర్వే నిర్వహించింది. అప్పట్లో రెండు రాష్ట్రాలు నిజాం పరిపాలనలోనే ఉండేవి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ ప్రభుత్వ హయాంలో మరో రెండు దశల సర్వేలు నిర్వహించారు. 1952 నుంచి 1954 వరకు దాదాపు 18 నెలలపాటు సర్వేలు కొనసాగినట్లు స్థానికులు చెబుతున్నారు. 1955లో పనుల కోసం కొన్ని భారీ యంత్రాలను సైతం పని ప్రదేశానికి తీసుకువచ్చారు. అయితే అదే ఏడాది అక్కడ పనిచేస్తున్న ప్రైవేట్‌ గుమాస్తా భార్య ప్రమాదవశాత్తు తెల్ల ఇసుక మడుగులో పడి చనిపోవడంతో కొంతకాలం పనులు నిలిపివేశారు. 1956లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రం ఆవిర్భావంతో ఈ సర్వే పనులు ముందుకు సాగలేదు. యంత్రాలను సైతం వెనక్కి తీసుకెళ్లారు. 1999లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 16 మినీ జల విద్యుత్‌ ప్రాజెక్టుల నిర్మాణాలు చేపట్టేందుకు నిర్ణయించింది. ఇందులో తలాయి విద్యుత్‌ కేంద్రం కూడా ఉంది. అనంతరం ఆ పార్టీ ఓటమి చెందడంతో ప్రాజెక్టు మరుగున పడింది. 2007లో ఏపీ జెన్‌కో అధికారులు తలాయి ప్రాజెక్టు ప్రతిపాదిత స్థలాన్ని సందర్శించారు. జల విద్యుత్‌ కేంద్రం ఏర్పాటు చేసి 100 మెగావాట్ల విద్యుత్‌ ఉత్పత్తి చేపట్టవచ్చని పేర్కొన్నారు. కానీ సంస్థ పరిధుల మేరకు 25 మెగావాట్ల ప్రాజెక్టు మాత్రమే నిర్మించే అవకాశం ఉండడంతో వారు వెనుదిరిగారు.

నెరవేరని హామీలు..

తెలంగాణ ఉద్యమ సమయంలో బెజ్జూర్‌ మండలంలో బస్సు యాత్ర సందర్భంగా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌ తలాయి జల విద్యుత్‌ కేంద్రం ఆంధ్రుల పాలనలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని పేర్కొన్నారు. 2009 ఎన్నికల సందర్భంగా హరీశ్‌రావు సైతం తలాయిని సందర్శించారు. ప్రాజెక్టు ప్రారంభానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ప్రజలు పేర్కొంటున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ పార్టీ పెండింగ్‌ ప్రాజెక్టులను పూర్తి చేయడంపై దృష్టి సారించింది. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలో సాగు, తాగు నీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటుంది. ఈ క్రమంలో తలాయి ప్రాజెక్టును నిర్మిస్తే వెనుకబడి కుమురం భీం జిల్లా ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు కోరుతున్నారు.

నిర్మాణానికి కృషి చేయాలి



మారుమూల ప్రాంతాల్లో ప్రాజెక్టులు నిర్మిస్తే స్థానిక ప్రజల జీవన స్థితిగతులు మారతాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకుని తలాయి జల విద్యుత్‌ ప్రాజెక్టు నిర్మాణానికి కృషి చేయాలి. స్థానిక రైతులకు సాగు నీరందించేందుకు చర్యలు తీసుకోవాలి.

– పెదం శ్రీధర్‌, తలాయి

ప్రభుత్వం దృష్టి సారించాలి



తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో అప్పటి రాష్ట్రస్థాయి ప్రజాప్రతినిధులు జల విద్యుత్‌ కేంద్రం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వాలు మారుతున్నాయి.. కానీ ప్రాజెక్టు నిర్మాణం మాత్రం మరుగున పడిపోయింది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ ప్రభుత్వం దీనిపై దృష్టి సారించాలి.

– సెడ్మక సాయికిరణ్‌, బెజ్జూర్‌

సికిల్‌ సెల్‌ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



కొలాంగుూరి గ్రామంలో సర్వేను పరిశీలిస్తున్న అమర్‌సింగ్‌ నాయక్‌

కెరమెరి(ఆసిఫాబాద్‌): సికిల్‌ సెల్‌ వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని వైద్యారోగ్య శాఖ అడిషనల్‌ డైరెక్టర్‌ అమర్‌సింగ్‌ నాయక్‌ అన్నారు. మండలంలోని కొలాంకొలారి, కొలాంగుూరి గ్రామాల్లో కొనసాగుతున్న సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆదిమ గిరిజనుల్లో ప్రతిఒక్కరూ సికిల్‌ సెల్‌, ఎనిమియాను గుర్తించేందుకు రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అంతకు ముందు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఔట్‌పేషెంట్ల వివరాలు, సిబ్బంది వివరాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు, రోగులకు అందిస్తున్న సేవల గురించి తెలుసుకున్నారు. ఆయన వెంట జిల్లా వైద్యాధికారి తుకారాం భట్‌, డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌ నాయక్‌, వైద్యాధికారి వినోద్‌కుమార్‌, సిబ్బంది శ్యాంలాల్‌, రషీద్‌, ఖలీల్‌ హుస్సేన్‌ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

గుండెపోటుతో బీఆర్ఎస్ నేత మృతి


సురేశ్ (ఫైల్)

జన్నారం: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ బీసీ సెల్ పట్టణాధ్యక్షుడు తోకల సురేశ్ (60) శుక్రవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. సురేశ్ గత ఎన్నికల్లో అవిశ్రాంతంగా పార్టీ కోసం పని చేశారు. పలు పదవులు నిర్వహించారు. ఆయన మృతి వార్త తెలుసుకుని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్య జాన్సన్‌నాయక్ వచ్చారు. మృతదేహం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. మండలానికి చెందిన పలువురు నాయకులు, అధికారులు సురేశ్ మృతదేహం వద్ద నివాళులర్పించారు.

ఉత్తమ డాక్టర్‌గా చెన్నూర్ వాసి


కృష్ణమోహన్‌కు అవార్డు ఇస్తున్న అనిల్‌కపూర్

చెన్నూర్: చెన్నూర్ పట్టణానికి చెందిన పొట్టల కృష్ణమోహన్‌కు ఉత్తమ వైద్యుడి అవార్డు దక్కింది. కృష్ణమోహన్ హైదరాబాద్‌లో వైద్యుడిగా విధులు నిర్వహిస్తున్నారు. 2023 సంవత్సరానికి గాను టైమ్స్ గ్రూప్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏటా ఇచ్చే ఉత్తమ అవార్డుకు కృష్ణమోహన్ ఎంపికయ్యారు. కాగా, కృష్ణమోహన్ రెండేళ్లుగా ఉత్తమ డాక్టర్‌గా అవార్డులు అందుకుంటున్నారు. ఈ ఏడాది బాలీవుడ్ హీరో అనిల్‌కపూర్ చేతుల మీదుగా అవార్డు తీసుకున్నారు. కృష్ణమోహన్‌ను త్వరలో చెన్నూర్ మిత్ర బృందం ఆధ్వర్యంలో సన్మానించనున్నట్లు బాల్యమిత్రులు నగేశ్, వాసుదేవ్, మొహినొద్దీన్ తెలిపారు.

విధుల్లో చేరిన కార్మికులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి సింగరేణి ఏరియాస్పత్రి నుంచి కైరిగూడ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుకు బదిలీ చేసిన 14 మంది కార్మికుల్లో శుక్రవారం కొంత మందిని తిరిగి ఏరియా ఆస్పత్రిలో విధులకు తీసుకున్నారు. కైరిగూడ ఓసీపీకి బదిలీ చేసిన ఉత్తర్వులను తాత్కాలికంగా రద్దు చేసి ఎనిమిది మంది కార్మికులను యథావిధిగా పనిలోకి చేర్చుకున్నారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ సింగరేణి సీఅండ్‌ఎండీ బలరాంనాయక్‌తో కార్మికుల బదిలీ గురించి మాట్లాడారు. ఈ నేపథ్యంలో సదరు కార్మికుల బదిలీ నిలుపుదల చేసినట్లుగా తెలుస్తోంది. మరో ఆరుగురు కార్మికుల బదిలీ విషయం తేలాల్సి ఉంది. ఏరియా జీఎం ఆ ఆరుగురు కార్మికుల బదిలీపై పట్టు వీడకుండా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.

మిస్సింగ్ కేసు నమోదు


శ్రీనివాస్ (ఫైల్)

తాండూర్: తాండూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒకరు అదృశ్యం కాగా మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన గోమాస శ్రీనివాస్ (45) గత నెల 7వ తేదీన వారణాసి తీర్థయాత్రకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. శ్రీనివాస్ తమ్ముడు గోమాస జగదీశ్ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. శ్రీనివాస్ ఆచూకీ తెలిసినవారు 8712656575 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

వాంకిడి: పేకాడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. మండలంలోని బంబార గ్రామ శివారులో పేకాడుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. ఐదుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.2,250 నగదు స్వాధీనం చేసుకున్నారు.

నిరీక్షణ ఫలించేదెప్పుడో!

- సాదాబైనామా దరఖాస్తులకు రెండేళ్లు
- పరిష్కారానికి రైతుల ఎదురుచూపు
- కాంగ్రెస్ ప్రభుత్వంపైనే గంపెడాశలు
- జిల్లాలో పెండింగ్‌లో 26,884 అర్జీలు


నెన్నెలలో దుక్కి దున్నుతున్న రైతు

నెన్నెల: సాదాబైనామా దరఖాస్తులకు రెండేళ్ల నుంచి పరిష్కారం లభించడం లేదు. జిల్లాలో 26,884 మంది రైతులు దరఖాస్తు చేసి తమ సమస్య పరిష్కారం కోసం వేచిచూస్తున్నారు. రికార్డుల్లో పేర్లు లేకపోవడంతో సాదాబైనామా కింద చేసిన దరఖాస్తులకు రెండేళ్ల నుంచి పరిష్కారం లభించడం లేదు. గతంలో తెల్లకాగితాలపై రాసుకుని భూముల క్రయవిక్రయాలు చేసుకున్నారు. ఇలాంటి సాదాబైనామాల క్రమబద్ధీకరణ కోసం గత ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. ఈ ప్రక్రియ ముగిసి రెండేళ్లు దాటినా ముందడుగు పడని పరిస్థితి. ఈ కొత్త ప్రభుత్వంపైనే దరఖాస్తుదారులు గంపెడాశలు పెట్టుకున్నారు.

గతంలో తెల్లకాగితాలపైనే..

మూడు, నాలుగు దశాబ్దాల కిందట వ్యవసాయ భూములు, ఇళ్ల స్థలాల క్రయవిక్రయాలు తెల్లకాగితాలపైనే జరిగేవి. ఆ తర్వాత కొన్నాళ్లకు స్టాంప్ పేపర్లపై క్రయవిక్రయ దస్త్రాలు రాసుకునే వారు. పూర్వీకులు ఇతరులకు భూములు విక్రయించినట్లు చిన్న కాగితం ఉన్నా వారి వారసులు ఆ భూముల జోలికి వెళ్లేవారు కాదు. ఆ పరిస్థితులు నేడు మారిపోయాయి. భూముల ధరలు పెరగడంతో స్థిరాస్తి వ్యాపారం జోరందుకుంది. దీంతో రికార్డుల్లో తమ పేర్లు ఉన్నాయంటూ కొందరి వారసులు తిరగబడుతున్నారు. 'ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్నామని.. ఇపుడు వచ్చి ఆ భూములు మావి అంటే ఎలా' అంటూ వివాదాలు ప్రారంభమవుతున్నాయి. అనేక మంది రైతులు భూముల సమస్యలపైనే నిత్యం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. వాటిని అధికారులు సమగ్రంగా పరిశీలించి పరిష్కరిస్తే చాలావరకు భూసమస్యలకు పరిష్కారం లభిస్తుంది.

మండలాల వారీగా అర్జీలు..

సాదాబైనామా దరఖాస్తులు జిల్లా వ్యాప్తంగా 26,884 వచ్చాయి. బెల్లంపల్లి నుంచి 2,417, నెన్నెలలో 1,163, భీమినిలో 615, కన్నెపల్లిలో 762, కాసిపేటలో 954, తాండూర్‌లో 1,275, వేమనపల్లిలో 948, మంచిర్యాలలో 165, లక్సెట్టిపేటలో 1,406, జన్నారంలో 259, హాజీపూర్‌లో 990, దండేపల్లిలో 1,522, నస్పూర్‌లో 225, చెన్నూర్‌లో 3,634, భీమారంలో 1,987, జైపూర్‌లో 1,920, మందమర్రిలో 1,580, కోటపల్లి నుంచి 762 దరఖాస్తులు వచ్చాయి.

పథకాలకు దూరంగా..

భూమిసాగు చేస్తున్నా హక్కులు మాత్రం లేవు. పెట్టుబడి సాయం, బీమా వంటి పథకాలకు అర్హత లేదు. సాదాబైనామా పద్ధతిలో భూములు కొనుగోలు చేసిన వారి పరిస్థితి ఇది. చట్టబద్ధత కల్పించే క్రమంలో భాగంగా దరఖాస్తులు స్వీకరించిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల వరకు తదుపరి నిర్ణయం తీసుకోకపోవడంతో దరఖాస్తుదారులకు ఎదురుచూపులే మిగిలాయి. కొత్త ప్రభుత్వమైనా స్పందించి సాదాబైనామాలకు చట్టబద్ధత కల్పించి పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.


ఆశతో ఎదురుచూస్తున్న



13 ఏళ్ల కిందట మూడెకరాల భూమి సాదాబైనామా కింద కొనుగోలు చేశాను. అప్పటి నుంచి పంటలు సాగు చేస్తున్న. సాదాబైనామా కింద పట్టా పాస్ పుస్తకం కోసం దరఖాస్తు చేసుకున్న. రికార్డులో పేరు ఎక్కితే ఇంత రైతుబంధు వస్తుందని ఆశతో ఎదురుచూస్తున్న.

– దురిశెట్టి రవి, నెన్నెల

సర్కారు పట్టించుకోవాలి



మా సమస్యలు కొత్త ప్రభుత్వం పట్టించుకుని సాదాబైనామాలో దరఖాస్తు చేసుకున్న వారికి పట్టాదారు పాస్‌పుస్తకాలు మంజూరు చేయాలి. పాస్‌పుస్తకం లేకపోవడంతో వ్యవసాయ రుణం, రైతుబంధు, రైతు బీమా లాంటి సంక్షేమ పథకాలకు దూరమవుతున్నాం.

– ఠాకూర్ గీత, ఖర్జీభీంపూర్

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


సీఎండీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నాయకులు సింగరేణి సీఎండీ ఎన్ బలరాంను కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ సీతారామయ్య, సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అక్బర్ అలీ బలరాంను కలిసి వినతిపత్రం ఇచ్చారు. కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని కోరారు. జీవో నంబర్ 22ను వెంటనే అమలు చేయాలని విన్నవించారు. ఈఎస్ఐ ఆస్పత్రిలో వైద్య సౌకర్యం కల్పించాలని కోరారు. గతంలో జరిగిన ఒప్పందం ప్రకారం బోనస్ పెంచాలని, చట్టబద్ధమైన లీవ్‌లను కల్పించాలని, పండుగ సెలవులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి బలరాం సానుకూలంగా స్పందించినట్లు నేతలు తెలిపారు. యూనియన్ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి కే వీరభద్రయ్య, నాయకులు బుర్ర తిరుపతి, అఫ్రోజ్‌ఖాన్, క్రిస్టోఫర్ శంకర్, కృష్ణ పాల్గొన్నారు.

సీఎండీకి ఐఎఫ్‌టీయూ వినతి

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు డీ బ్రహ్మానందం, ప్రధాన కార్యదర్శి ఏ వెంకన్న సీఎండీని కలిసి వినతిపత్రం ఇచ్చారు. 11వ పీఆర్సీ ప్రకారం కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు అమలు చేయాలని, హైపవర్ కమిటీ వేతనాలతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు.

జీవో ప్రకారం వేతనాలు ఇవ్వాలి


సమావేశంలో నర్సరీ కార్మికులు

శ్రీరాంపూర్: సింగరేణిలో పనిచేస్తున్న నర్సరీ కార్మికులకు ప్రభుత్వ అగ్రికల్చర్ శాఖ జీవో ప్రకారం వేతనాలివ్వాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్‌లోని యూనియన్ కార్యాలయంలో శుక్రవారం శ్రీరాంపూర్, మందమర్రి, గోలేటి నర్సరీ కార్మికుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవో ప్రకారం నర్సరీ కార్మికులకు వేతనాలతోపాటు బోనస్ చెల్లించాలని కోరారు. సెప్టెంబర్ 2022లో కాంట్రాక్ట్ కార్మికులు 18రోజులపాటు సమ్మె చేశారని తెలిపారు. సమ్మె సందర్భంగా జరిగిన ఒప్పందం మేరకు యాజమాన్యం సత్వరమే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం స్పందించి సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. శ్రీరాంపూర్ నర్సరీ అధ్యక్ష, కార్యదర్శులు కట్ట కళ, మోతె సరోజన, విజయలక్ష్మి, కళావతి, శారద తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు చర్యలు


రోడ్డుపై నీళ్లు కొడుతున్న దృశ్యం

జైపూర్: మండలంలోని రామారావుపేట పంచాయతీ పరిధిలో సింగరేణి ఓపెన్‌కాస్టు గనుల్లో నిబంధనలకు విరుద్ధంగా పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపట్టకుండా పనులు నిర్వహిస్తుండగా స్థానిక సర్పంచ్ నామాల సత్యవతి తిరుపతి, స్థానికులు హైకోర్టులో ఫిర్యాదు చేశారు. స్పందించిన హైకోర్టు పర్యావరణశాఖ బోర్డు, సింగరేణి అధికారులను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేయగా శుక్రవారం పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపట్టారు. పర్యావరణశాఖ నిజామాబాద్‌శాఖతో పాటు సింగరేణి ఉన్నతాధికారులకు నోటీసులు జారీ చేశారు. దీంతో వెంటనే అధికారులు రామారావుపేట గ్రామంలో పొల్యూషన్ మిషన్ బిగించడంతో పాటు గ్రామంలో ప్రతీరోజు మూడు పూటలా రోడ్లపై నీళ్లు చల్లుతున్నారు. గ్రామప్రజల జీవనశైలిపై ఓసీపీ ప్రభావం చూపకుండా అధికారులు తగిన జాగ్రత్తలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. నామమాత్రంగా రోడ్లపై నీళ్లు చల్లకుండా రోజుకు వందల సంఖ్యలో నడిచే లారీల మూలంగా వెలువడే కాలుష్యాన్ని నియంత్రించాలని కోరారు.

నత్తనడకన మహిళా భవన్ పనులు

- బల్దియాలకు రూ.5.50 కోట్ల నిధులు
- ఒక్కో పంచాయతీకి రూ.18 లక్షలు
- కొన్ని చోట్లనే కొనసాగుతున్న పనులు
- అధికారుల పర్యవేక్షణ కరువు


చెన్నూర్‌లో నిర్మిస్తున్న మహిళా భవన్

చెన్నూర్: మహిళా సాధికారతే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం గతేడాది నియోజకవర్గంలోని 102 పంచాయతీలు, మూడు మున్సిపాలిటీల్లో సమ్మక్క-సారలమ్మ మహిళా భవన్‌ల నిర్మాణాలను ప్రతిపాదించింది. చెన్నూర్, మందమర్రి, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలకు రూ.5.50 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఇందులో చెన్నూర్‌కు రూ.1.50 కోట్లు, మందమర్రికి రూ.2కోట్లు, క్యాతన్‌పల్లికి రూ.2కోట్ల చొప్పున నిధులు మంజూరు చేయగా చెన్నూర్, మందమర్రి మున్సిపాలిటీల్లో భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో మహిళా భవన్ నిర్మాణ పనులు నేటికీ ప్రారంభించలేదు.

పంచాయతీకి రూ.18లక్షలు..

సమ్మక్క-సారలమ్మ మహిళా భవన్‌ల నిర్మాణంలో భాగంగా తొలివిడత నియోజకవర్గంలోని 58 గ్రామపంచాయతీలను ఎంపిక చేసింది. గ్రామపంచాయతీకి రూ.18 లక్షల నిధులు కేటాయించింది. మొదటి విడత నియోజకవర్గంలోని 58 గ్రామపంచాయతీల్లో భవన నిర్మాణానికి రూ.18 లక్షల చొప్పున నిధులు కేటాయించారు. నేటికీ పంచాయతీల్లో సమ్మక్క-సారలమ్మ భవన నిర్మాణాలు ప్రారంభానికి నోచుకోలేదు. గత ప్రభుత్వ హయాంలో గ్రామపంచాయతీల్లో సమ్మక్క-సారలమ్మ మహిళా భవన్ నిర్మాణ ప్రతిపాదనలు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం నిధుల కేటాయింపును నిలిపివేసినట్లు తెలిసింది. దీంతో గ్రామపంచాయతీల్లో మహిళా భవన నిర్మాణాలకు బ్రేక్ పడే అవకాశాలున్నాయని అధికారులు పేర్కొనడం గమనార్హం.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


మనీషా

మంచిర్యాలఅర్బన్: ఢిల్లీలో ఈనెల 9నుంచి 12వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి కళోత్సవ్ పోటీలకు స్థానిక కేజీబీవీలో తొమ్మిదో తరగతి చదువుతున్న మనీషా డ్రామా సోలో విభాగంలో జాతీయ స్థాయికి ఎంపికైంది. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు స్పెషలాఫీసర్ స్వప్న తెలిపారు.

ఆలిండియా పోటీలకు సుజిత్..

రాజస్థాన్ జేజేటీయూ ఈనెల 2నుంచి 5వ తేదీ వరకు సౌత్ వెస్ట్ ఇంటర్ యూనివర్సిటీ నేషనల్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించగా వాగ్దేవి డిగ్రీ కళాశాల విద్యార్థిని సుజిత్ పాల్గొని ప్రతిభ కనబరిచింది. ఈనెల 8నుంచి 12వ తేదీ వరకు నిర్వహించే ఆల్ ఇండియా యూనివర్సిటీ తైక్వాండో చాంపియన్ షిప్‌నకు ఎంపికైనట్లు కళాశాల యాజమాన్యం పేర్కొంది.

8న అప్రెంటీస్ మేళా

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ కాలనీలోని ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 8న అప్రెంటీస్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.చందర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా కంపెనీలు హాజరవుతున్నాయని పేర్కొన్నారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్, ఎలక్ట్రానిక్ మెకానిక్, కోపా వంటి ట్రేడ్‌లలో 2023 నాటికి పాసైన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గలవారు సోమవారం ఉదయం 9గంటల వరకు సంబంధిత సర్టిఫికెట్లతో మేళాకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

డీజే యజమానిపై కేసు

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మార్కెట్ సెంటర్‌లో గురువారం రాత్రి పెళ్లి భరాత్‌లో డీజే సౌండ్‌తో న్యూసెన్స్ క్రియేట్ చేసిన దాని యజమాని మహ్మద్ సల్మాన్(చోటు)పై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రకుమార్ తెలిపారు. బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్‌పై మహ్మద్ దురుసుగా ప్రవర్తించాడని పేర్కొన్నారు. డీజే సౌండ్స్ వినియోగించడం నిషేధమని, ఎవరైనా వినియోగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

జెడ్పీటీసీ సభ్యురాలి ఇంటికి నిప్పు


కాలిన పత్తి, ఇంటి తలుపు

బెజ్జూర్: గుర్తు తెలియని దుండగులు బెజ్జూర్ జెడ్పీటీసీ సభ్యురాలు పంద్రం పుష్పలత ఇంటికి గురువారం రాత్రి నిప్పంటించారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సోమినిలోని ఇంటిలో జెడ్పీటీసీ సభ్యురాలు పత్తి నిల్వ చేశారు. ఎవరూ లేని సమయంలో దుండగులు ఇంటికి నిప్పంటించారు. మంటలు చెలరేగగా స్థానికులు గమనించి ఆర్పివేశారు. అప్పటికే రూ.20వేల నష్టం జరిగినట్లు జెడ్పీటీసీ సభ్యురాలు తెలిపారు. తన ఇంటికి నిప్పంటించిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని జెడ్పీటీసీ ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై విక్రమ్ ఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు.

ముగ్గురి మృతి కారకుడికి పదేళ్ల జైలు

ఆసిఫాబాద్: మద్యం మత్తులో అజాగ్రత్తగా వాహనం నడుపుతూ ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తుల మరణానికి కారకుడైన కాగజ్‌నగర్‌కు చెందిన పుల్ల కృష్ణకు 10 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.25,500 జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ శుక్రవారం తీర్పు చెప్పారు. లైజనింగ్ అధికారి కే సాగర్, కాగజ్‌నగర్ సబ్ డివిజనల్ లైజనింగ్ అధికారి బాబాజీ తెలిపిన వివరాల ప్రకారం.. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఫిబ్రవరి 2, 2020న సాయంత్రం ఈజ్‌గాం సమీపంలో పట్టణానికి చెందిన పుల్ల కృష్ణ మద్యం మత్తులో పత్తి లోడ్‌తో ఉన్న బొలెరో వాహనాన్ని అజాగ్రత్తగా నడుపుతూ ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ముగ్గురు మృతి చెందారు. ఆటో డ్రైవర్ మనోజ్ ఫిర్యాదు మేరకు కాగజ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో పోలీసులు చార్జిషీట్ దాఖలు చేసి సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టారు. నేరం రుజువు కాగా న్యాయమూర్తి పైతీర్పు చెప్పారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ జగన్మోహన్ రావు వాదించారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీస్ అధికారులను ఈ సందర్భంగా ఎస్పీ అభినందించారు.

బస్సు సౌకర్యం కల్పించాలి


డీఎంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నెన్నెల: మండలంలోని చిత్తాపూర్, మెట్‌పల్లి, నార్వాయిపేట, కోణంపేట గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని శుక్రవారం కాంగ్రెస్ నాయకులు మంచిర్యాల డిపో మేనేజర్ రవీంద్రనాథ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఆయా గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించి దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా చూడాలని డిపో మేనేజర్‌తో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఫోన్‌లో మాట్లాడారు. సానుకూలంగా స్పందించిన డీఎం బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. గుండ్ల సోమారం ఎంపీటీసీ సభ్యుడు దాగం రమేశ్, యూత్ అధ్యక్షుడు లావుడియా రమేశ్, డీసీసీ సభ్యుడు గట్టు బానేశ్, ఓబీసీ యూత్ అధ్యక్షుడు మహేశ్, నాయకులు బాపురెడ్డి, నీలయ్య, అల్లూరి శ్రీనివాస్, శంకర్, మొగిలి పాల్గొన్నారు.

శేజల్‌కు న్యాయం చేయాలి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, అతడి అనుచరులు భూకబ్జాలు, రౌడీయిజం, మహిళలపై అకృత్యాలకు పాల్పడుతున్నారని మావోయిస్టు పార్టీ సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ శుక్రవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. చిన్నయ్య దౌర్జన్యం, లైంగిక వేధింపులకు గురైన శేజల్‌కు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లైంగిక వేధింపులపై విచారణ జరిపి చిన్నయ్య, అతడి అనుచరుల నుంచి కాపాడి శేజల్‌కు న్యాయం చేస్తామన్న కాంగ్రెస్ నాయకుల హామీ కంటితుడుపు చర్యగా మారిందని విమర్శించారు. ఓ వైపు బీఆర్ఎస్ గూండాలు శేజల్‌ను భయభ్రాంతులకు గురి చేస్తున్నా కాంగ్రెస్ పాలకులు, పోలీసులు మౌనంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. శేజల్ వ్యవహారంలో ఎమ్మెల్యే వినోద్ స్పందించి ఆమెపై నమోదు చేసిన ఎస్సీ, ఎస్టీ కేసులను ఉపసంహరించుకునేలా చూడాలన్నారు. లేనిపక్షంలో శిక్ష తప్పదని హెచ్చరించారు.

ఇన్‌చార్జి డీఎస్‌వోకు సన్మానం


వాజీద్ అలీని సన్మానిస్తున్న సంఘం సభ్యులు

మంచిర్యాలటౌన్: జిల్లా పౌరసరఫరాల శాఖ ఇన్‌చార్జి అధికారిగా ఎండీ వాజీద్ అలీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌చార్జిగా పనిచేసిన పెద్దపల్లి డీఎస్‌వో ప్రేమ్‌కుమార్ స్థానంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఏసీఎస్‌వోగా విధులు నిర్వహిస్తున్న వాజీద్ అలీని మంచిర్యాలకు బదిలీ చేసి డీఎస్‌వోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో శుక్రవారం ఆయనను జిల్లా చౌక ధరల దుకాణాల డీలర్ల సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు శాలువాతో సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు మోటపలుకుల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బొమ్మ సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యక్షులు సాగె బాపు, రామాంజనేయులు, ప్రచార కార్యదర్శి అంకం మనోజ్, రేషన్ డీలర్లు బానేశ్, బుర్ల మహేందర్, అంకం తిరుపతి పాల్గొన్నారు.

ఒకే ఈతలో రెండు లేగదూడలు


లేగదూడలతో ఆవు

నెన్నెల: మండలంలోని ఆవుడం గ్రామానికి చెందిన రైతు బేతి మహేశ్ ఆవు శుక్రవారం ఒకే ఈతలో రెండు మగ లేగదూడలకు జన్మనిచ్చి అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. లేగదూడలు ఆరోగ్యంగా ఉన్నాయని మహేశ్ ఆనందంగా చెప్పాడు. ఈ విషయమై పశువైద్యాధికారి దిలీప్ మాట్లాడుతూ.. ఒకే ఈతలో రెండు లేగదూడలు జన్మించడం చాలా అరుదని తెలిపారు. జన్యుపరంగా రెండు అండాలు ఉత్పత్తి కావడంతో రెండు దూడలు పుట్టాయని పేర్కొన్నారు. కాగా, లేగదూడలను స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

మతిస్థిమితం లేని వ్యక్తిని పోలీసులకు అప్పగింత

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధి మహాలక్ష్మీవాడకు చెందిన మతిస్థిమితం లేని ప్రసన్న అనే వ్యక్తిని ఆస్పత్రికి తరలించినట్లు స్థానిక సీఐ కృష్ణ శుక్రవారం తెలిపారు. అతడు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రసన్న ఊత్కూరు గ్రామంలో కొందరిని ఇబ్బందులకు గురిచేయడంతో స్థానికులు అతడిని చితకబాది పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. కాగా, సదరు వ్యక్తిని వైద్యపరీక్షల కోసం ఆస్పత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు.

గురుకృప దినోత్సవానికి ఏర్పాట్లు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, కమిటీ సభ్యులు

నార్నూర్: ఈ నెల 11న కొత్తపల్లి-హెచ్ జాతీయ బంజారా దీక్షా భూమి వద్ద నిర్వహించే గురుకృప దినోత్సవానికి భారీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. గురువారం దీక్షా భూమి వద్ద దీక్ష గురువు శ్రీసంత్ ప్రేంసింగ్ మహారాజ్ సమక్షంలో పోస్టర్ ఆవిష్కరించారు. నిర్వహణపై కమిటీ అధ్యక్షుడు జాదవ్‌రెడ్డి నాయక్‌తో చర్చించారు. లక్ష మందితో ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలన్నారు. వివిధ రాష్ట్రాలతో పాటు ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురుకృప దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. బంజారాలకు మహారాష్ట్రలోని పోరదేవి తర్వాత తెలంగాణలోని కొత్తపల్లి-హెచ్ జాతీయ బంజారా దీక్ష భూమి రెండోవ స్థానంలో ఉంటుందన్నారు. దీక్ష గురువు శ్రీ సంత్ ప్రేంసింగ్ మహారాజ్ ఆధ్వర్యంలో మహాపూజ ఉంటుందని, జాతర ఉత్సవాలకు ఈ నెల 20వరకు ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ డీఎంను కోరినట్లు తెలిపారు. కమిటీ సభ్యులు డాక్టర్ నారాయన్, రాథోడ్ రమేశ్, రాథోడ్ రామేశ్వర్, ఆదివాసీ నాయకుడు మెస్రం హన్మంతరావు, పీఏసీఎస్ డైరెక్టర్ కాంతారావు దుర్గే, సర్పంచ్ రాథోడ్ విష్ణు, ఎంపీటీసీ సభ్యుడు పరమేశ్వర్, ఎస్ఎంసీ చైర్మన్ రాథోడ్ సుభాష్, పీడీఎస్‌యూ నాయకుడు సుధాకర్ ఉన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలటౌన్: ఉమ్మడి జిల్లాలో డిగ్రీ ఉత్తీర్ణులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ విద్యార్థులకు గ్రూపు-1, 2, 3, 4 ఫౌండేషన్ కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి బి.వినోద్‌కుమార్, ఆదిలాబాద్ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జి.ప్రవీణ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణ ఫిబ్రవరి ఒకటి నుంచి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. నాలుగు నెలలు శిక్షణ ఉంటుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 8నుంచి 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో www.tsbcstudycircle.cgg. gov.in, https://studycircle. cgg.gov.in వెబ్‌సైట్ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆదాయం రూ.5 లక్షలలోపు ఉండాలని, రిజర్వేషన్, డిగ్రీ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక విధానం ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 08732-221280లో సంప్రదించాలని సూచించారు.